# ‘వ్యవసాయ సంక్షోభానికి కారణమైన పాలకుల విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి’

## కా॥కె.కోటయ్య వర్థంతి సందర్భంగా జరిగిన రాష్ట్రస్థాయి సదస్సులో ప్రొ॥గోలక్ బిహారీనాథ్ ఉద్ఘాటన




సదస్సులో ప్రసంగిస్తున్న కా॥ఝాన్సీ; వేదికపై ఇతర వక్తలు; అమరులకు నివాళులర్పిస్తున్న ప్రతినిధులు

**విజయవాడ, 8-12-19:**

**విప్లవ** కమ్యూనిస్టు ఉద్యమనేత రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్రనాయకులు కామ్రేడ్ కొప్పుల కోటయ్య రెండవ వర్థంతి సందర్భంగా రైతుకూలీసంఘం(ఆం.ప్ర)ఆధ్వర్యంలో ‘తీవ్రమౌతున్న వ్యవసాయరంగ సంక్షోభం-మనముందున్న కర్తవ్యాలు’పై రాష్ట్రస్థాయి సదస్సు జరిగింది. డిసెంబర్ 8వ తేదీ ఉ॥11 గం॥కు స్థానిక మాకినేని బసవపున్నయ్య విజ్ఞానకేంద్రంలో ప్రారంభమైన ఈ సదస్సుకు హాజరైన వక్తలను రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్రకార్యవర్గ సభ్యులు కా॥యు.వీరబాబు వేదికపైకి ఆహ్వానించగా, సంస్థ రాష్ట్ర అధ్యక్షులు కా॥సింహాద్రి ఝాన్సీ ఈ సదస్సుకు అధ్యక్షత వహించారు.

కా॥ఝాన్సీ అధ్యక్షోపన్యాసం చేస్తూ కా॥కోటయ్య ఉద్యమ జీవిత విశేషాల్ని గుర్తుచేశారు. కా॥కోటయ్యకు జోహార్లర్పిస్తూ, ఈ మధ్యకాలంలో మరణించిన రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర నాయకులు రామన్నగౌడ్, తెలంగాణా రైతుకూలీసంఘం రాష్ట్ర నాయకులు కా॥ నల్లాన స్వామీరావులకు నివాళులర్పిస్తూ; తొలితరం కమ్యూనిస్టు నాయకులు భూపతి నారాయణమూర్తి; ‘అరుణోదయ’నాయకులు కా॥రామారావులకు జోహార్లర్పిస్తూ; ఆత్మహత్యలకు పాల్పడిన రైతాంగ కుటుంబాలకు సంతాపం తెలియపరుస్తూ; ప్రకృతి విపత్తులలో కనుమూసిన వారి కుటుంబాలకు సానుభూతి తెలుపుతూ సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. సదస్సుకు హాజరైన వారంతా అమరుల స్మృతిలో రెండు నిముషాలు మౌనం పాటిస్తూ లేచి నిలబడ్డారు. అమరులను స్మరిస్తూ ప్రజాకళాకారులు పాటలు పాడారు.

సదస్సులో తొలుత **‘జనశక్తి’ సంపాదకులు డా॥పి.జస్వంతరావు** మాట్లాడుతూ మనదేశం ‘ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్య (ఆర్సెప్) వాణిజ్య ఒప్పందం నుండి వైదొలగాలని డిమాండ్ చేశారు. ఇటీవల వియత్నాంలో జరిగిన ఆర్సెప్ మలివిడత సమావేశంలో అంతిమ ఒప్పందంపై మనదేశం సంతకం చేయలేదనే వార్తలు వెలువడినప్పటికీ, దేశంలో విదేశీ పెట్టుబడుల నిబంధనలను ఎత్తిచేస్తూ భారత ప్రభుత్వం అనేక రాయితీల నిచ్చిందన్నారు. పాలు, పాల ఉత్పత్తులపై దిగుమతి సుంకాన్ని తగ్గించటానికి కూడా కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. ఈ తరహా దుర్మార్గ వ్యవసాయ, వాణిజ్య ఒప్పందాలన్నింటి నుండీ దేశం వైదొలగాలని ఆయన డిమాండ్ చేశారు. విదేశీ మదుపుదారులు మనదేశంలోని భూమిని ఎంతైనా కొనుగోలు చేసుకోవటానికి ఈ ఒప్పందాలు అవకాశం కల్పిస్తున్నాయన్నారు. ఈ ఒప్పందాలను అమలుచేస్తున్న న్యూజిలాండ్‌లో చైనాకు చెందిన ఆలీబాబా సంస్థ ఒక్కటే లక్ష ఎకరాలు కొనుగోలు చేసి డైరీ ఫారమ్ పెట్టిందన్నారు. థాయిలాండ్‌లో నాలుగు లక్షల ఎకరాలను విదేశీ సంస్థలు కొనుగోలు చేశాయన్నారు. రైతాంగ సమస్యల గురించి కా॥జస్వంతరావు మాట్లాడుతూ రైతాంగ ఆదాయాన్ని రెట్టింపు చేస్తామంటున్న పాలకుల మాటలు ఒట్టిబూటకమని వివరించారు. ఆదాయం 10శాతం పెరిగితే, ఉత్పాదక వ్యయం110% పెరుగుతోందన్నారు. కాంట్రాక్టు వ్యవసాయాన్ని, ప్రైవేటు మార్కెటింగ్ వ్యవస్థను ప్రోత్సహించటం, వ్యవసాయ రంగంలోకి విదేశీ పెట్టుబడి అధికంగా రావటానికి ఉద్దేశించిన చర్యలను పాలకులు చేపడుతున్నారన్నారు. రైతాంగ అప్పు రద్దు మాత్రమే వారిని ప్రస్తుత సంక్షోభం నుండి పడవేయలేదని ఆయన స్పష్టం చేశారు. విప్లవాత్మక భూపంపకం ద్వారానే వ్యవసాయరంగ సంక్షోభం పరిష్కారమౌతుందని పునరుద్ఘాటిస్తూ ఆయన తన ఉపన్యాసం ముగించారు.

వ్యవసాయరంగ సంక్షోభానికి పాలకులు అనుసరిస్తున్న రాజకీయ, ఆర్థిక విధానాలే కారణమని ఒడిషా-సంబల్‌పూర్ విశ్వవిద్యాలయ విశ్రాంత ఆచార్యులు **ప్రొఫెసర్ గోలక్ బీహారీనాధ్** వ్యాఖ్యానించారు. రాష్ట్రసదస్సులో ముఖ్యవక్తగా ఆయన కీలకోపన్యాసం చేశారు. ప్రొఫెసర్ బీహారీనాధ్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ జిడిపి 4.5 శాతానికి ఘోరంగా పడిపోయిన పరిస్థితుల్లో; విద్య, వైద్యం, రైల్వే, బీమా, రక్షణ రంగాలన్నింటినీ ప్రైవేటీకరిస్తున్న నేపధ్యంలో; దళితులు, మైనారిటీలు, ఆదివాసీలపై హంతకదాడులు జరుగుతున్న కాలంలో; అర్బన్ మావోయిస్టుల పేరున ప్రజాస్వామికవాదుల గొంతు నులుముతున్న సందర్భంలో – చుట్టుముట్టిన తీవ్రమైన ఆర్థిక సంక్షోభం నడుమ ఈ సదస్సు జరుకుంటున్నామని నేపధ్యాన్ని గుర్తుచేశారు. కొందరు ఆర్థికవేత్తలు చెబు తున్నట్లుగా ఈ ఆర్థిక మందగమనం చక్రభ్రమణ స్వభావం కలదికాదని, వ్యవసాయ పారిశ్రామిక రంగాల ఘోర నిర్లక్ష్యం ఫలితంగానే ఈ సంక్షోభం ఏర్పడిందని ఆయన సోదాహరణంగా వివరించారు. దేశ అవసరాలకు అనుగుణమైన పారిశ్రామిక విధానాలను అనుసరించాలని; గ్రామీణ ప్రాంతంలో రైతులకు, వ్యవసాయ కూలీలకు భూమిపై హక్కు కల్పించాలన్నారు. ఈ వ్యవస్థను సమూలంగా మార్పుచేసుకునే దిశగా ఉద్యమాలను ఎక్కుపెట్టాలని ప్రొఫెసర్ బీహారీనాధ్ తన ప్రసంగంలో పిలుపునిచ్చారు.

**విశ్రాంత ఆచార్యులు ప్రొ॥ఎన్. వేణు గోపాలరావు** మాట్లాడుతూ రైతాంగం పండించిన పంటకు ఉత్పాదక ఖర్చు పెరిగి పోవటం, పంటకు గిట్టుబాటు ధరలేకపోవటం, సకాలంలో సరైన ధరకు రైతాంగం పండించిన పంటను కొనుగోలుచేయకపోవటం, సంస్థాగత రుణాలు లభించక ప్రైవేటు వడ్డీవ్యాపారులపై ఆధారపడటం వంటి కారణాలన్నీ రైతాంగాన్ని పీకలలోతు సంక్షోభంలోకి నెడుతున్నాయన్నారు.

**రైతుకూలీసంఘం(ఆం.ప్ర)రాష్ట్ర కార్యదర్శి కా॥ఎం.ఎస్.నాగరాజు** మాట్లాడుతూ వ్యవసాయ సంక్షోభాన్ని పరిష్కరించే చర్యలు చేపట్టని పాలకులు, ప్రజల్ని మోసగించి తాత్కాలికంగా జోకొట్టే విధానాల్ని అనుసరిస్తున్నారన్నారు. 'రైతుభరోసా' పేరున కేంద్రం మరియు వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలు రైతులకు నేరుగా అందించే నగదు సహాయం వ్యవసాయ, రైతాంగ సంక్షోభ పరిష్కారానికి ఏవిధంగానూ తోడ్పడ దన్నారు. పంట ఉత్పాదకాల ఖర్చులన్నీ తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు.

**సంఘం రాష్ట్రఅధ్యక్షులు కా॥సింహాద్రి ఝాన్సీ** మాట్లాడుతూ వ్యవసాయరంగ సంక్షోభాన్ని కప్పిపుచ్చే మరో నాటకమే జీరో బడ్జెట్ న్యాచురల్ ఫార్మింగ్(జెడ్‌బిఎన్ఎఫ్) అని వివరించారు. పాలకుల మాయమాటలకు, మోసపు వాగ్దానాలకు, ప్రజాకర్షక చిట్కాలకు లోనుగాకుండా రైతాంగం, ప్రజానీకమంతా తమ సమస్యలకు గల అసలు కారణాన్ని గుర్తెరగా లన్నారు. మతం, కులం, ప్రాంతం, భాష పేరుతో ప్రజలను చీల్చి, విద్వేషాలు రెచ్చగొట్టి, పాలకులు తమ పబ్బంగడుపుకుంటున్నారని సోదాహరణంగా ప్రస్తుత రాజకీయ పరిస్థితులకు జోడిస్తూ ఆమె వివరించారు. కార్మిక, కర్షక ఐక్యత పునాదిగా పాలకుల ప్రజావ్యతిరేక విధానాలపై సంఘటిత ఉద్యమ నిర్మాణానికి కృషిచేయాలని ఆమె పిలుపునిచ్చారు.

**ముగింపులో–**

1. 2020 జనవరి 8న దేశవ్యాపితంగా 'గ్రామీణ భారత బంద్'లో సంఘం శ్రేణులంతా క్రియాశీలకంగా పాల్గొనాలని–
2. వ్యవసాయరంగ సంక్షోభాన్ని కప్పిపుచ్చే మరో నాటకమే జీరోబడ్జెట్ ప్రకృతి వ్యవసాయమని ప్రకటిస్తూ–
3. ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్య (ఆర్సెప్) వాణిజ్య ఒప్పందాలనుండి మనదేశం వెంటనే వైదొలగాలని డిమాండ్ చేస్తూ–
4. రైతాంగ వ్యతిరేకమైన నూతన విత్తన చట్ట ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ – సదస్సు తీర్మానాలను ఆమోదించింది.

ప్రజాకళాకారుల పాటలు, బాలకళాకారుల నృత్యాలు సదస్సుకు హాజరైన వారిని ఆకట్టుకున్నాయి.

ooo